దుమ్ము.. ధూళి

- గాజువాక రహదారులపై ప్రయాణం నరకప్రాయం
- కళ్లు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి
- రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్న వాహన చోదకులు, పాదచారులు



దుమ్ము, ధూళితో నిండిన పోర్టు రోడ్డు

గాజువాక: గాజువాకలోని పలు రహదారులపై రాకపోకలకు ద్విచక్ర వాహన చోదకులు హడలిపోతున్నారు. జాతీయ రహదారితోపాటు పట్టణంలోని పలు మెయిన్ రోడ్లు దుమ్ము, ధూళితో నిండిపోతున్నాయి. దీంతో ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు కళ్లు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నిబంధనలు పాటించకుండా లారీల్లో రవాణా చేస్తున్న ఇసుక, మట్టి, కాంక్రీట్ మిక్సింగ్ మెటీరియల్, కెమికల్ పౌడర్లు రోడ్లపై పడిపోవడంతో జనం తిరగలేని పరిస్థితి ఏర్పడుతోంది. దీన్ని నియంత్రించాల్సిన అధికారులు తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని వాహన చోదకులు ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితిలో రోడ్లపై వెళ్లే వారు తిరిగి ఇంటికి చేరుకునేసరికి నరకం చూస్తున్నారు. దుమ్ము వల్ల కళ్ల మంటలు, కళ్ల నొప్పులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు గురవుతున్నారు.

భారీ వాహనాలతో ఇబ్బందులు

- గాజువాక ఆటోనగర్ నుంచి కాంక్రీట్ మిక్సింగ్ మెటీరియల్ తెస్తున్న లారీలు, మిక్సర్ వాహనాలు నిబంధనలు పాటించడం లేదు. మిగిలిన వ్యర్థాలను పలు చోట్ల రోడ్ల మీదే ఒలకబోస్తున్నాయి. అక్కడ విపరీతమైన దుమ్ము గాల్లోకి లేస్తుండటంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- శ్రీనగర్ నుంచి వందడుగుల జంక్షన్ వరకు, మరో వైపు వడ్లపూడి ఫ్లై ఓవర్ వంతెన వరకు ప్రయాణం నరకంగా మారుతోంది.
- గంగవరం పోర్టు రోడ్డులోని వై జంక్షన్ నుంచి చిన గంట్యాడ వందడుగుల రోడ్ జంక్షన్ వరకు ఇదే పరిస్థితి నెలకొంది. లారీల్లో బొగ్గు, జిప్సమ్ పెద్ద మొత్తంలో సరఫరా అవుతున్నాయి. అవి రోడ్డు మీద పడిపోతుండటంతో ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.
- వందడుగుల జంక్షన్ నుంచి పంతులుగారి మేడ వరకు హైవేపై రోడ్డంతా దుమ్ము, ధూళితో నిండిపోయి రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. చిన్నపాటి వర్షం చినుకులు పడితే ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది.
- షీలానగర్ నుంచి కాన్వెంట్ జంక్షన్ వరకు గల పోర్టు రోడ్డు రాకపోకలు సాగించడానికి వీల్లేనంతగా దుమ్మూధూళితో నిండిపోయింది.
- వందడుగుల రోడ్ నుంచి హైవేపై అగనంపూడి వరకు పరిస్థితి దారుణంగా మారింది. బొగ్గుతోపాటు వివిధ పారిశ్రామిక మెటీరియల్లను తీసుకెళ్తున్న భారీ లారీలు నిబంధనలు పాటించడం లేదు. జాతీయ రహదారిపై దుమ్ము దారుణంగా ఎగిరి వాహన చోదకులను అవస్థలపాలు చేస్తోంది.

ప్రధాన రహదారులపై కొద్ది రోజుల క్రితం వరకూ జీవీఎంసీ సిబ్బంది శుభ్రం చేసేవారు. ఇప్పుడు వారు కూడా దీన్ని పెద్దగా పట్టించుకోకపోవడం లేదనే ఆరోపణలున్నాయి. రోడ్లపై ఇసుక, దుమ్ము పెద్ద ఎత్తున పోగవుతుండటంతో కళ్లు మూసుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాహన చోదకులు, పాదచారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



జగ్గు జంక్షన్ రోడ్డులో ప్రయాణిస్తున్న లోడ్ లారీ

హోంగార్డుల సేవలు ప్రశంసనీయం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం 62వ హోం గార్డ్స్ రైజింగ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని హోం గార్డ్స్ బ్యారక్స్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి సీజీఎం(హెచ్ఆర్) జి.గాంధీ జెండా ఎగురవేశారు. హోంగార్డులు అందజేసిన గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించి మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ ఆస్తుల రక్షణలో హోంగార్డుల సేవలు విశిష్టమైనవన్నారు. అత్యవసర సమయాల్లో హోంగార్డులు ప్లాంట్‌కు మంచి సేవలు అందిస్తున్నారన్నారు. శాంతిభద్రతల రక్షణలో పోలీసులకు, ట్రాఫిక్ నియంత్రణలో భద్రతా విభాగానికి హోంగార్డులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. హోంగార్డ్ బి.శ్రీనివాసరెడ్డికి బెస్ట్ హోం గార్డు అవార్డు అందజేశారు. కార్యక్రమంలో రాజభాష విభాగం జీఎం లలన్ కుమార్, అడ్మిన్ డీజీఎం అంజనీకుమార్, ఏజీఎం సిహెచ్.నీరజ, సీనియర్ మేనేజర్లు డి.శివకుమార్, బి.కుమార్, డి.ఉషశ్రీ తదితరులు పాల్గొన్నారు.



అప్పారావుకు బెస్ట్ హోంగార్డ్ అవార్డు అందజేస్తున్న సీజీఎం గాంధీ

నిలిచిన టెండర్లు వెంటనే ప్రారంభించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో నిలిచిపోయిన టెండర్లను వెంటనే పునఃప్రారంభించాలని ఉక్కు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉక్కు పరిపాలన భవనం వద్ద అఖిలపక్ష కాంట్రాక్ట్ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ క్యూఏటీడీ, ఎస్‌టీఈడీ, సీఎంఎస్ విభాగాల్లోని టెండర్లు సకాలంలో పూర్తి కానుందున సుమారు 500 మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారన్నారు. దీని వల్ల ఇటు కార్మికులకు అటు కంపెనీకి నష్టం వాటిల్లుతుందని చెప్పారు. ఉక్కు యాజమాన్యం కావాలనే టెండర్ల ప్రక్రియను జాప్యం చేస్తోందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. యాజమాన్యం పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జి.శ్రీనివాసరావు, నమ్మి రమణ, చట్టి నర్సింగరావు, పి.మసేను, పి.నారాయణరావు, ఎన్.శశిభూషణ్, వి.వి.రమణ, సూర్యకుమార్, ఆడారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

క్లుప్తంగా

వేగం వద్దు.. భద్రతే ముద్దు



స్టీల్‌ప్లాంట్ మెయిన్ గేటు వద్ద ప్రచారం చేస్తున్న భద్రతా విభాగం ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ప్రమాదాల నియంత్రణకు ప్రతీ ఒక్కరూ భద్రతా నియమాలు పాటించాలని ఉక్కు భద్రతా విభాగాధిపతి ఎం.ఎస్.ఎన్.రాజు కోరారు. ఉక్కు భద్రతా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మెయిన్ గేటు వద్ద స్పీడ్ గన్‌తో వాహనాల వేగ నియంత్రణ, హెల్మెట్ ధారణపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ రహదారుల్లో 30 కిలో మీటర్ల వేగంతో మాత్రమే ప్రయాణించాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. వేగ నియంత్రణపై అవగాహన పెంచేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. విభాగం అధికారులు ఎం.వరప్రసాద్, బయ్యే మల్లయ్య, మాధవ్‌కుమార్, పి.కృష్ణమూర్తి, అభిజిత్, సెంట్రల్ సేఫ్టీ కమిటీ సభ్యులు రాము, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కనీస వేతనం చెల్లించాలి

ఉక్కునగరం: రాజ్యాంగం మహిళలకు అన్నింట్లో సమాన హక్కులు కల్పించినప్పటికీ పనికి తగ్గ వేతనం చెల్లించడం లేదని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి వై.సత్యవతి ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా ఉక్కునగరం కమిటీ ఆధ్వర్యంలో ఇంటి పనివారు, స్కూళ్ల ఆయాలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ మాల్స్‌లో మహిళలకు కనీస వేతనాలు, పని గంటలు అమలు కావడం లేదన్నారు. ఇంటి పనిచేసే మహిళలపై దాడులు జరుగుతున్నాయన్నారు. ఇటీవల సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో జరిగిన ఉదంతాన్ని గుర్తు చేశారు. ప్రజలు డబ్బుకు, మందుకు అమ్ముడుపోయి ఓట్లు వేయడం వల్ల ఈ పరిస్థితి దాపురించిందన్నారు. దాడులు, హింస జరిగినప్పుడు అందరూ చైతన్యవంతులై బయటకొచ్చి పోరాడాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కె.విమల, జోన్ కార్యదర్శి కె.వేణు, విజయలక్ష్మి, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ ఎనర్జీ మీటర్ టెక్నీషియన్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్, నైపుణ్యాభివృద్ధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ ఎనర్జీ మీటర్ టెక్నీషియన్ కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసి 18 నుండి 45 ఏళ్ల వయసు కలవారు అర్హులన్నారు. మూడు నెలల పాటు పెదగంట్యాడలోని నేక్ కార్యాలయంలో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు 8039003957 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. శిక్షణ కాలంలో ఉచితంగా స్టేషనరీ ఇవ్వనున్నామని, మధ్యాహ్న భోజనంతో పాటు శిక్షణ పూర్తి చేసిన వారికి రూ.7,500 స్టైఫండ్ ఇస్తామన్నారు. శిక్షణ అనంతరం ప్రయివేటు సెక్టార్లలో ఉపాధి కల్పిస్తామన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

అగనంపూడి: రైలు ఢీకొన్న సంఘటనలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. దువ్వాడ జీఆర్పీ ఎస్ఐ లక్ష్మి తెలిపిన వివరాలిలా.. అనకాపల్లి నుంచి విశాఖ వచ్చే మార్గంలో దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో ప్లాట్‌ఫామ్ చివరిలో సుమారు 35 ఏళ్ల వయసున్న వ్యక్తిని రైలు ఢీకొంది. మృతుడు ఐదున్నర అడుగుల ఎత్తు, చామనఛాయ రంగులో ఉండడంతోపాటు తెలుపు, నలుపు నిలువుగీతల ఫుల్‌హ్యాండ్స్ షర్ట్, నలుపురంగు తువ్వాలు, మెరూన్ రంగులో ఫుల్‌ప్యాంట్ ధరించి ఉన్నాడు. వ్యక్తి కుడిచేతిపై అన్నపూర్ణ తమ్ముడు అని తెలుగులో పచ్చబొట్టు ముద్రించి ఉందని, ఛాతిపై అమ్మ, నాన్నల పచ్చబొట్టు వేసి ఉన్నాయని, వివరాలు తెలిసిన వారు దువ్వాడ జీఆర్పీ ఔట్‌పోస్టులో నేరుగా గాని, 73820 58996 నంబర్‌లో గాని సంప్రదించాలని ఎస్ఐ లక్ష్మి కోరారు.

రెవెన్యూ సదస్సులతో భూములకు భద్రత

అక్కిరెడ్డిపాలెం: భూముల పరిరక్షణకు ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెవెన్యూ విభాగంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రెవెన్యూ స్పెషల్ కలెక్టర్ మధుసూదన్ రెడ్డి, గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి మాట్లాడుతూ భూ సమస్యలపై అర్జీదారులు సమర్పించిన దరఖాస్తులను 45 రోజుల్లోగా పరిష్కరిస్తామన్నారు. గాజువాక పరిధిలో 18 రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గాజువాక జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సబ్ రిజిస్ట్రార్ తారకేష్ మాట్లాడుతూ రిజిస్ట్రేషన్‌లో ఎటువంటి తప్పులున్నా దరఖాస్తు చేసుకుంటే సరిచేస్తామన్నారు. కార్పొరేటర్ గుడివాడ అనూష మాట్లాడుతూ 68వ వార్డులో తన హయాంలో రూ.20 కోట్ల పనులు చేపట్టి పూర్తి చేశామన్నారు. గాజువాకలో తహసీల్దార్ శ్రీవల్లి వచ్చిన తర్వాత రెవెన్యూ సమస్యల పరిష్కారంలో పనులు వేగవంతం అయ్యాయన్నారు. పలువురు అర్జీదారులు పలు సమస్యలపై రెవెన్యూ స్పెషల్ కలెక్టర్, తహసీల్దార్‌లకు వినతిపత్రాలు సమర్పించారు. 19 భూ సమస్యలపై అర్జీలు వచ్చినట్లు ఆర్ఐ మృదుల తెలిపారు. నాయకులు గుడివాడ లతీష్, ఆర్ఐ మహేష్, వీఆర్వో ఆనంద్, సర్వేయర్ రామారావు, సచివాలయాల వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ఆలస్యంగా వచ్చిన ఎమ్మెల్యే పల్లా

రెవెన్యూ సదస్సు ఉదయం 10 గంటలకు ప్రారంభం కావల్సి ఉండగా.. 11.30 గంటలకు మొదలైంది. అప్పటికే ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు రావల్సి ఉండగా సీఎం చంద్రబాబు కార్యక్రమంలో నిమగ్నమైన తాను రావటం అనుమానమేనని, కార్యక్రమాన్ని ప్రారంభించేయండని తెలిపారు. దీంతో కార్యక్రమాన్ని తహసీల్దార్, రెవెన్యూ స్పెషల్ కలెక్టర్‌లు ప్రారంభించారు. మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం సాగింది. అప్పటికే అధికారులు తిరిగి వెళ్లిపోయారు. హఠాత్తుగా ఎమ్మెల్యే కార్యక్రమానికి వస్తున్నారని సమాచారం రావటంతో ఎమ్మార్వో, రెవెన్యూ స్పెషల్ కలెక్టర్, కార్పొరేటర్ తిరిగి కార్యక్రమానికి విచ్చేశారు.

సైకిల్‌పై శబరిమలకు అయ్యప్ప స్వాములు

అగనంపూడి: అగనంపూడి నిర్వాసిత కాలనీ కొండయ్యవలసకు చెందిన 13 మంది అయ్యప్ప మాలధారులు శుక్రవారం సైకిల్‌పై శబరిమల యాత్రకు బయలుదేరారు. అయ్యప్ప పీఠం గురుస్వామి బి.గంగాధరరావు ఆధ్వర్యంలో వరుసగా 11వ సారి సైకిల్ యాత్రకు వెళ్తున్నారు. అగనంపూడి మరిడిమాంబ ఆలయం వద్ద పూజలు చేసిన అనంతరం వారు బయల్దేరారు. ఈ సందర్భంగా గంగాధరరావు మాట్లాడుతూ మార్గం మధ్యలోని పుణ్యక్షేత్రాలను దర్శించుకుని 1,800 కిలోమీటర్ల దూరం ప్రయాణం సాగుతుందన్నారు. అన్నవరం సత్యనారాయణ స్వామి, విజయవాడ దుర్గాదేవి, దుర్గామల్లేశ్వరి, తిరుపతి, కాణిపాకంతోపాటు ప్రముఖ దేవాలయాలను సందర్శిస్తామని తెలిపారు. చివరిగా శబరిమల చేరుకొని అయ్యప్ప స్వామిని దర్శించుకుంటామన్నారు. ఎస్.ప్రకాష్, ఇ.రామసూరి అప్పలరాజు, ఎస్.అప్పలరాజు, వి.అప్పలనాయుడు, బి.శంకరరావు, ఎల్.లక్ష్మణరావు, కె.కనకారావు, సిహెచ్.రమణ, ఆర్.ప్రసాద్, బి.నరసింగరావు తదితరులు యాత్రగా బయల్దేరారు. ఈ సందర్భంగా వీరిని అగనంపూడికి చెందిన నాయకులు శాలువాలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బలిరెడ్డి శేఖర్, సత్యనారాయణ, పట్టా రామకృష్ణ, శీరందాసు రాము, బుదిరెడ్డి పైడిరాజు, పలకా అచ్చుత్, విందుల చందు, దాసరి వరాలు, కరణం రవికుమార్ పాల్గొన్నారు.



శబరిమలకు సైకిల్ యాత్రగా బయలుదేరిన అయ్యప్ప భక్తులు

రాష్ట్ర ఎంపీలు నోరెత్తకపోవడం దారుణం

అగనంపూడి: ఉక్కు మంత్రి హెచ్‌డీ కుమారస్వామి పార్లమెంట్ సాక్షిగా విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియ ముందుకు సాగుతుందని ప్రకటించిన సమయంలో అక్కడున్న రాష్ట్ర ఎంపీలు కనీసం నోరెత్తకపోవడం బాధాకరమని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకుడు అయోధ్యరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. కూర్మన్నపాలెం కూడలిలో కొనసాగుతున్న 1,396వ రోజు రిలే దీక్షా శిబిరంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎంపీ కీర్తి అజాద్ పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు సమాధానంగా మంత్రి ఈ విధమైన ప్రకటన చేశారని, ఆ సమయంలో పార్లమెంట్‌లో ఉన్న తెలుగు రాష్ట్ర ఎంపీలు కిమ్మనకుండా ఉండటంలో ఆంతర్యం ఏంటో అర్థమవుతోందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్న విశాఖ ఉక్కు విషయంలో పాలకులు ఇలా వ్యవహరించడం దారుణమన్నారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఉక్కు పరిశ్రమను ఉరికంబం ఎక్కిస్తున్నారని, వీటికి రాష్ట్రానికి చెందిన ఎంపీలే సాక్ష్యమన్నారు. గత జూలైలో విశాఖ స్టీల్‌ప్లాంట్ సందర్శించే సమయంలో ఉక్కు మంత్రి కుమారస్వామి చేసిన ప్రకటన మర్చిపోయి ప్రవర్తించడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి విశాఖ పర్యటనకు వచ్చిన సందర్భంగా స్పష్టమైన ప్రకటన చేసి స్టీల్‌ప్లాంట్‌ను రక్షించాలన్నారు. నాయకులు శ్రీనివాసరాజు, బి.అప్పారావు, టీవీకె రాజు, గంగాధర్, మరిడయ్య, దుర్గా ప్రసాద్, శ్రీనివాస్, పూర్ణచంద్రరావు తదితరులు మాట్లాడారు.



స్టీల్‌ప్లాంట్ దీక్షలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలిక

పెదగంట్యాడ: మండలంలోని వాంబే కాలనీకి చెందిన తప్పిపోయిన బాలికను తల్లిదండ్రులకు న్యూపోర్టు పోలీసులు శుక్రవారం అప్పగించారు. వివరాలిలా.. వాంబే కాలనీకి చెందిన ఓ బాలిక శుక్రవారం ఉదయం తన అమ్మమ్మతో కలిసి పాఠశాలకు బయల్దేరింది. మార్గం మధ్యంలో కళ్లు తిరుగుతున్నాయని చెప్పడంతో అటుగా బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని బాలిక అమ్మమ్మ ఆపింది. బాలికను వాంబే కాలనీలో దించాలని కోరింది. ఆ వ్యక్తి బాలికను వాంబే కాలనీలో దించేసి వెళ్లిపోయాడు. తర్వాత ఆ బాలిక ఇంటికెళ్లకుండా ఎక్కడికో వెళ్లిపోయింది. ఇంటి వద్ద లేకపోవడంతో అమ్మమ్మ ఆందోళన చెందింది. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేసింది. అన్ని ప్రాంతాలను బృందాలుగా విడిపోయి గాలించారు. చివరకు సాయంత్రం 6 గంటల సమయంలో పాఠశాల విడిచి పెట్టే సమయానికి అక్కడికి చేరుకుంది. వెంటనే బాలికను గుర్తించిన పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యానికి సమాచారమిచ్చారు. బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు.

వైభవంగా శ్రీవారి శాంతి కల్యాణం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శుక్రవారం శ్రీవారి శాంతి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి శ్రవణా నక్షత్రం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు ఆదర్శనీయం



దువ్వాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి, దామా సుబ్బారావు



కూర్మన్నపాలెంలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న కోమటి శ్రీనివాసరావు తదితరులు



భెల్ పార్కులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న యూనిట్ హెడ్ సుబ్రహ్మణ్యం



ఆటోనగర్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రశాంత్‌కుమార్



స్టీల్‌ప్లాంట్ పార్కులో అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న జీఎం మధుసూదనరావు, నాయకులు



పెదగంట్యాడలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న చింతలపూడి, తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు



70వ వార్డులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఉరుకూటి చందు తదితరులు

రాజ్యాంగ నిర్మాత వర్ధంతిలో వక్తలు

అగనంపూడి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలను అందిపుచ్చుకోవాలని వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జి తిప్పల దేవన్ రెడ్డి అన్నారు. 86వ వార్డు దువ్వాడ వంతెన వద్ద నిర్వహించిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. కూర్మన్నపాలెం ఎస్సీ, ఎస్టీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ దామా సుబ్బారావు, గాజువాక క్లస్టర్ అధ్యక్షుడు బొడ్డ గోవింద్, సంఘ అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు, నాయకులు డాక్టర్ ప్రకాశరత్నం, బి.ఎ.స్వామి, గాలి ఆనంద్, బచ్చల పైడిరాజు, ఆర్.కోటేశ్వరరావు, డాక్టర్ విజయ్ కుమార్, భూతిరాజు శ్రీనివాసరాజు, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

- 87వ వార్డులోని కూర్మన్నపాలెం కూడలి, లక్ష్మీపురం కాలనీ, కణితి అంబేడ్కర్ కాలనీ, పాత వడ్లపూడి నిర్వాసిత కాలనీల్లో అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు, పోలేటి సూరి అప్పారావు, మైల కష్టారావు, సుబ్బన్న, పొన్నాడ వాసు, నడుపూరి నూకరాజు, కోమటి రమాదేవి, పావాడ శ్రీనివాస్, బలిరెడ్డి శ్రీకాంత్, సబ్బవరపు పార్వతి పాల్గొన్నారు.
- 79వ వార్డు పాత అగనంపూడి కూడలిలో మహాత్మా గాంధీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో అంబేడ్కర్‌కు సంఘ అధ్యక్షుడు చిత్తా రామారావు పూలమాల వేసి నివాళులర్పించారు. కోసూరి తాతారావు, పాపారావు, యలమంచిలి అప్పారావు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 87వ వార్డు కణితి నిర్వాసిత కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ గాజువాక క్లస్టర్ అధ్యక్షుడు బొడ్డ గోవింద్ పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు ఆడారి శ్రీను, నరసింహమూర్తి, చిత్రాడ రాజు, సునీల్, రవి, మల్ల సతీష్, సంతోష్, ఆనంద్, పాల్గొన్నారు.
- 86వ వార్డు రాజీవ్‌నగర్‌లో కూర్మన్నపాలెం ఎంఎంఎస్ కమిటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి కమిటీ నాయకుడు నిమ్మకూరి రమేష్ పూలమాల వేసి నివాళులర్పించారు.
- 87వ వార్డు సిద్దార్థనగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్పొరేటర్ బొండా జగన్ నివాళులర్పించారు. నాయకులు విజయరామరాజు, జె.ఎస్.మూర్తి, బలిరెడ్డి నాగేశ్వరరావు, బాల భాస్కరరావు, రమేష్, ఆదినారాయణ పాల్గొన్నారు.
- 85వ వార్డు అగనంపూడిలోని మినీ జగదాంబ జంక్షన్‌లో నిర్వహించిన అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి, ప్రసాద్, నాయకులు కర్రి దేశేంద్ర, కత్తి తిలక్, గంతకోరు అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ, విందుల రాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

అక్కిరెడ్డిపాలెం: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని భెల్(హెచ్‌పీవీపీ) యూనిట్ హెడ్ జి.సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. సంస్థలోని అంబేడ్కర్ పార్క్‌లో గల బాబా సాహెబ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంస్థ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సభా అధ్యక్షుడు కొల్లి దేముడు నేతృత్వంలో జీఎం శ్రీ జా, ఏజీఎం(హెచ్ఆర్) ఎస్.లీల, దివాకర్, ఏజీఎం పట్నాయక్, సీనియర్ మేనేజర్ చంద్రశేఖర్, యూనియన్ నాయకులు బొండా బాబూరావు, సుభాకర్ సాహూ, పి.వి.ఎస్.రాజు, సీహెచ్.సీతంనాయుడు, ఎస్.జగన్నాధం పాల్గొన్నారు.

- ఆటోనగర్ ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తల ఆధ్వర్యంలో కెనరా బ్యాంక్, వాసీవా సంయుక్తంగా అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. విశాఖ ఎస్సీ, ఎస్టీ ఎంటర్‌ప్రెన్యూర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పారిశ్రామిక వేత్తలు అశోక్‌రాజు, సాయిబాబు, నూకరాజు, ఎంఎస్ఎంఈ ఏడీ చంద్రమౌళి, వాసీవా అధ్యక్షుడు పాండురంగ ప్రసాద్ పాల్గొన్నారు.
- 69వ వార్డు షీలానగర్‌లోని అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ట్రస్ట్ అధ్యక్షుడు ఆళ్లమూడి ప్రభాకరరావు ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గాజువాక కో ఆర్డినేటర్ పి.ఎం.ఎం.వెంకటరావు, ఎయిర్‌పోర్టు ఏరియా కో ఆర్డినేటర్ కటారి కార్తీక్, కె.ఆర్.ఎస్.ప్లాజా ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ కార్యాలయం, సెక్టార్–6 అంబేడ్కర్ పార్కులోని బాబాసాహెబ్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి స్టీల్‌ప్లాంట్ హెచ్ఆర్ జీఎం ఎం.మధుసూదనరావు మాట్లాడుతూ దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛ, సమానత్వం అందించి సమాన అవకాశాలు కల్పించిన ఘనత అంబేడ్కర్‌దని కొనియాడారు. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బి.తౌడన్న, బయ్యే మల్లయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లైజన్ ఆఫీసర్లు నల్లి సుందరం, బాబూ నాయక్, అసోసియేషన్ నాయకులు ఎస్.సత్యనారాయణ, ఎస్.మోహనబాబు, పుల్లారావు, ఎల్.వి.రమణారావు, ఫణీంద్రబాబు, సంఘాల నాయకులు కె.వి.డి.ప్రసాద్, పి.సత్యనారాయణ, డి.సురేష్‌బాబు పాల్గొన్నారు.

పెదగంట్యాడ: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సేవలు మరువలేమని మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ గాజువాక పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి అన్నారు. పెదగంట్యాడ ఫైర్ స్టేషన్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాబూ జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గంట్యాడ గురుమూర్తి, మార్టుపూడి పరదేశి, మంత్రి రాజశేఖర్, టేకేటి పెంటయ్య, మంత్రి శంకర నారాయణ, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, యల్లబెల్లి వెంకటరమణ, కాకినాడ పెంటారావు, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాజువాక: జీవీఎంసీ 70వ వార్డు ఎర్రగెడ్డ కాలనీలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి కార్పొరేటర్ ఉరుకూటి చందు పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం నిర్వాహకుడు పైడికొండ, స్థానిక నాయకులు బొడ్డేడ రమణ, సత్యారావు, కొణతాల రాము, మోహన్ కృష్ణ, బాబులు నాయుడు, రాజు, బుజ్జి, కృష్ణ పాల్గొన్నారు.


- ఎల్వీ నగర్‌లో ఎస్సీ, ఎస్టీ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్, యువజన సేవా సంఘం నాయకుడు బల్లంకి నాగరాజు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- వందడుగుల రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరణంరెడ్డి నర్సింగరావు, గూటూరు శంకరరావు, ములకలపల్లి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ కుటుంబాల వనసమారాధన రేపు

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 8న బ్రాహ్మణ కుటుంబాల ఆత్మీయ కలయిక, వన సమారాధనను గాజువాక గంగవరం రోడ్డులోని గాడెపల్లి గార్డెన్, గ్రీన్ వ్యాలీ లేఅవుట్‌లో నిర్వహించనున్నట్లు సంఘ ప్రతినిధులు పరిమి నాగేంద్ర, చుండూరు విశాలాక్షి తెలిపారు. శుక్రవారం ఆటోనగర్ ఈ–బ్లాక్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ బ్రాహ్మణ సమాజంలో వ్యాపారం చేసే బ్రాహ్మణ కుటుంబాలను ఒకే చోట చేర్చి ఒకరికొకరు సహకరించుకుంటూ తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. బిజినెస్ బై బ్రాహ్మణ సంస్థ ద్వారా ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, బ్యాంకు లోన్లు, మొదలైన రావడానికి తోడ్పాటును అందిస్తుందన్నారు. పీసపాటి లక్ష్మి, సిరిపల్లి అనూరాధ, వి.వి.కె.శర్మ, బీజేపీ మూర్తి పాల్గొన్నారు.

ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థే

అక్కిరెడ్డిపాలెం: ప్రతి ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని రచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ బి.వి.పట్టాభిరామ్ అన్నారు. విశాఖకు చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు అలజంగి ఉదయ్‌కుమార్ రచించిన ఎఫెక్టివ్ టీచర్స్ అనే పుస్తకాన్ని 68వ వార్డు మిందిలో శుక్రవారం పట్టాభిరామ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు కొత్తతరానికి చెందిన విద్యార్థులకు బోధించడానికి ఈ పుస్తకం చక్కగా ఉపయోగపడుతుందన్నారు. పుస్తక రచయిత ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ డాక్టర్ పట్టాభిరామ్ చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించడం సముచితమని, ఆయన ఆదర్శ ఉపాధ్యాయుడిని కొనియాడారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పట్టాభిరామ్, ఉదయ్‌కుమార్

తల్లిదండ్రులు - ఉపాధ్యాయుల సమావేశం నేడు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు మింది జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు- ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించనున్నట్లు హెచ్ఎం పి.వి.ఎస్.ఎస్.ఆంజనేయ తెలిపారు. శుక్రవారం స్కూల్‌లో ఆయన మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. రాబోయే రెండేళ్లలో పాఠశాల సాధించనున్న ఫలితాలు, చేరుకోనున్న లక్ష్యాలు వంటి అంశాలపై తల్లిదండ్రులను ఉద్దేశించి ఉపాధ్యాయుల ప్రసంగిస్తారని చెప్పారు. ఉపాధ్యాయులు ఎం.వి.ఎల్.శైలజ, బి.చైతన్య, ఎన్.శంకర్, బి.శ్రీనివాస్, మహ్మద్ పాల్గొన్నారు.

- అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శనివారం టీచర్స్–పేరెంట్స్ సమావేశం జరగనున్నట్లు హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం తెలిపారు.